ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377



మరమ్మతులకు నోచుకోని దద్దనాల ప్రాజెక్టు స్లూయిస్ గేట్లు



దగాపడ్డ బనగానపల్లె

- ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- సీఎం జగన్ చెప్పిన మాటలన్నీ నీటి మూటలే
- హామీలన్నీ మర్చిపోయిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 21:

బనగానపల్లె నియోజవర్గం గత ఐదేళ్లలో పూర్తిగా దగా పడింది. సీఎం జగన్ నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వరకు ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. దీంతో నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నది. గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ బనగానపల్లె మండలం హుసేనాపురం గ్రామంలో జరిగిన సభలో 200 యూనిట్లు వరకు విద్యుత్ పేదలందిరికీ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. జోలదొరాసి సమీపంలో మినీ రిజర్వాయర్‌ను నిర్మిస్తామన్నారు. అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత దాన్ని మర్చిపోయారు. నాపరాళ్ల పరిశ్రమను ఆదుకుంటామని చెప్పిన సీఎం జగన్ ఆ పరిశ్రమను పాతాళానికి తొక్కారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దద్దనాల ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి డోన్ మండలం కొచ్చెర్వు నుంచి పసుపుల చెరువుకు నీరు మళ్లించి అక్కడి నుంచి దద్దనాల ప్రాజెక్టుకు సాగునీరందిస్తామని చెప్పిరైతులను దగా చేశారు. ఎస్సార్బీసీ నుంచి దద్దనాల ప్రాజెక్టుకు నీరు పంపింగ్ చేయకపోవడంతో ప్రాజెక్టు ఎండిపోయింది. రైతులు నష్టపోయారు.

నియోజకవర్గంలోని చెరువులకు రూ.35.10 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. బనగానపల్లె దద్దనాల ప్రాజెక్టుకు రూ.14.12 కోట్లు, కుక్కలగంటి చెరువుకు రూ.2.80 కోట్లు, రాళ్లకొత్తూరు ఊరకుంట చెరువుకు రూ.40లక్షలు, సంజామల మండలం ముక్కమళ్ల చెరువుకు రూ.7.50 కోట్లు, హోత్రమాన్‌దిన్నె చెరువుకు రూ.2.40 కోట్లు, రామభద్రునిపల్లె చెరువుకు రూ.20లక్షలు, కానాల చెరువుకు రూ.6 కోట్లు, అవుకు మండలం వేములపాడు చెరువుకు రూ 20లక్షలు, మంగంపేట ఊట చెర్వుకు రూ.59 లక్షలు, మంగంపేట తండా ఊట చెరువుకు 69లక్షలు, మెట్టుపల్లె చెరువుకు కూ.20లక్షలతో అధికారులు మూడేళ్లక్రితం ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చి మర్చిపోయారు. అలాగే వరద నీటి కోసం తవ్విన గాలేరు నగరి కాల్వలో కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం సిమెంట్ లైనింగ్ వేసింది. భూగర్భ జలం ఇంకకపోవడంతో బోర్లలో నీరు తగ్గిపోయింది. అలాగే పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకానికి 2012లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శిలాఫలకం వేసి వదిలేశారు. బనగానపల్లె పట్టణంలో రింగ్ రోడ్డు నిర్మాణం, కోవెలకుంట్ల పట్టణంలో కుందూనది విస్తరణ పనులు అటకెక్కాయి. బెలుం గుహల నుంచి ఆదాయం వస్తున్నా అభివృద్ధి పనులు చేపట్టలేదు. అవుకు రిజర్వాయర్ వద్ద బోటింగ్ సౌకర్యం గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయల్టీ ధరలు, సెక్యూరిటీ డిపాజిట్లు, డెడ్‌రెండ్లు భారీగా పెంచడంతో నాపరాయి పరిశ్రమ సర్వనాశనమైంది. కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె వద్ద చెక్‌పోస్టును ఎత్తివేసి గని యజమానులకు మేలు చేస్తామని కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చి తుంగలో తొక్కారు.

అవుకులో: అవుకు టన్నెల్ నిర్మాణం పనుల్లో అంతులేని జాప్యం జరుగుతోంది. అవుకు రిజర్వాయర్ రిబిట్‌మెంట్ అక్కడక్కడా కుంగిపోతోంది. రిజర్వాయర్ గేట్లుకు అమర్చిన నిర్మాణం లోపాలతో నీరు లీకవుతోంది. ఈ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలా లేదు.



నత్తనడకన సాగుతున్న అవుకు టన్నెల్ పనులు

ఎస్సార్బీసీ: ఎస్సార్బీసీ నుంచి 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ప్రధాన కాల్వ మరమ్మతులకు గురై చాలా చోట్ల గండ్లు పడి సాగునీరు వృథా అవుతోంది. అవుకు టన్నెల్ పనుల్లో అంతులేని జాప్యం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లుగా పాల్ట్‌జోన్ పనులు మాత్రమే పూర్తి చేసింది. ఇప్పటికీ చాలా చోట్ల లైనింగ్, కాంక్రీట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అవుకు రిజర్వాయర్‌లో ఎర్రరాళ్లతో నిర్మించిన రిబెట్‌మెంట్ అక్కడక్కడా కుంగిపోయింది. అలాగే మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు భారీగా కోతలకు గురయ్యాయి. రిజర్వాయరు నుంచి లోకల్ ఆయకట్టుకు నీరందించే ప్రధాన పంట కాల్వలు చాలాచోట్ల దెబ్బతిని గండ్లు పడ్డాయి. రిజర్వాయర్‌లో అంతర్భాగమైన పాలేరు, తిమ్మరాజు స్లూయిస్‌గేట్లు లీకేజీలతో వృథాగా నీరు బయటకు పోతోంది. పంట కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చివరి ఆయకట్టుకు నీరందక రైతులు నష్టపోతున్నారు. వెరసి ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం బనగానపల్లె నియోజకవర్గాన్ని దగా చేసిందనే విమర్శలు ఉన్నాయి.

సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో: వర్షకాలం వస్తే పాలేరు ఉప్పొంగుతుంది. ఈ వాగు మీద బ్రిడ్జి నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ హామీ అటకెక్కింది. కొలిమిగుండ్ల మండలంలో తిమ్మనాయునిపేటకు గాలేరు నగరి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయిస్తామన్న హామీని అమలు చేయలేదు. రామ్‌కో సిమెంట్, అల్ట్రాటెక్, యనకండ్ల జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీల కింద భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడం లేదు. కొలిమిగుండ్ల మండలం కోటపాడు వద్ద ప్రిజమ్ సిమెంట్ ఏర్పాటు చేస్తామని రైతుల నుంచి భూములు సేకరించి ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోవడంతో భూములు కోల్పోయిన రైతులు అటు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయక, ఇటు ఉద్యోగావకాశాలు లేక వలసలు వెళ్తున్నారు. ఇప్పటికీ క్రిష్ణగిరి నుంచి మంగంపేటకు మట్టిరోడ్డే గతి. బనగానపల్లె పట్టణ శివారులోని రైల్వే స్టేషన్‌కు మట్టి రోడ్డుపైనే ప్రయాణించాలి. బనగానపల్లె మార్కెట్ యార్డు గోదాములు ఐదేళ్లుగా అర్థాంతరంగా నిలిచినా ఎమ్మెల్యే పట్టించుకోలేదు.




నాపరాయి గని



మరమ్మతులకు నోచుకోని ఎస్సార్బీసీ ప్రధాన కాలువ

నేడు శ్రీశైలానికి చంద్రబాబు



శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం సోమవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు శ్రీశైలానికి రానున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాక్షిగణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని శ్రీశైలంలోని భ్రమరాంబ సదన్ అతిథి గృహానికి చేరుకుంటారు. తరువాత క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకుంటారు. తర్వాత భ్రమరాంబికా మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు జరిగే ప్రత్యేక పూజల్లో చంద్రబాబు పాల్గొంటారు.

కోడ్ ఉంటే మాకేం?

- వైసీపీ ప్రచారంలో మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు
- శ్రీశైలం వైసీపీ పరిశీలకుడిగా హబీవుల్లా నియామకం



ఈ నెల 19న ఆత్మకూరులో జరిగిన వైసీపీ సభలో మాట్లాడుతున్న మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబీవుల్లా

ఆత్మకూరు, ఏప్రిల్ 21: ప్రభుత్వ సలహాదారులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ సలహాదారులెవరూ పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెప్పింది. అయినా మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు డీఎస్ హబీవుల్లా దర్జాగా వైసీపీ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మార్చి 16వ తేదీ ఎన్నికల కోడ్ మొదలైంది. ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఏకీకృత నిధి నుంచి జీతభత్యాలు పొందుతున్న వారు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనరాదు. అయితే రాష్ట్రంలోని పలువురు ప్రభుత్వ సలహాదారులుగా కేబినెట్ హోదాల్లో కొనసాగుతూ ప్రజాధనాన్ని జీతభత్యాలుగా పొందుతూ వైసీపీ జపంలో మునిగి తేలుతున్నారు. దీనిపై ఇటీవల ఎన్డీఏ కూటమి సహా మరిన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. దీనిపై ఈనెల 16వ తేదిన ఎన్నికల కమిషన్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి జీతభత్యాలు పొందుతున్న 40మంది రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు కాబట్టి వారు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని హెచ్చరించింది. అయినా నంద్యాలకు చెందిన మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు డీఎస్.హబీవుల్లా ఈనెల 18న జరిగిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఈ నెల 19వ తేదీన ఆత్మకూరులో జరిగిన వైసీపీ రాజకీయ కార్యక్రమంలో ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈయనను వైసీపీ అధిష్టానం శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడిగా నియమించింది. దీంతో ఆయన నియోజకవర్గంలో పలువురిని వైసీపీలోకి చేర్పించేందుకు సంప్రదింపులు కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెంట పర్యటిస్తూ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ప్రభుత్వ సలహాదారులు హబీవుల్లాపై ఎన్నికల కమిషన్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

నల్లమల ఘాట్‌లో లారీ బ్రేక్ ఫెయిల్

- కొండను ఢీకొట్టి పక్కకు దూకిన డ్రైవర్
- తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ మృతి

మహానంది, ఏప్రిల్ 21: మహానంది మండలం నల్లమల ఘాట్‌లో ఆదివారం తెల్లవారుజామున క్రాంతి ట్రాన్స్‌పోర్టుకు చెందిన వాహనం బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్ ఎలగాటి పెద్దిరాజు(39) మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఏలూరు నుంచి కర్నూలుకు క్రాంతి ట్రాన్స్‌పోర్టుకు చెందిన పార్సిల్ లారీ మార్గమధ్యలోని నల్లమల ఘాట్ పాత టన్నెల్ బొగద వద్దకు చేరుకుంది. ఇక్కడికి వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన లారీ డ్రైవర్ పెద్దిరాజు రహదారి పక్కనే ఉన్న కొండను ఢీకొట్టించి పక్కకు దూకాడు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి



శ్రీశైలం ఆలయంలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు

శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

గెలుపే లక్ష్యంగా పని-చేయండి..!

- టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు
- దిశా నిర్దేశం చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

నంద్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గెలుపే లక్ష్యంగా పనిచేసి, జిల్లాలో టీడీపీ జెండా ఎగురవేయాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని పార్టీ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికలు - 2024కు సర్వం సిద్ధమైన టీడీపీ నంద్యాల జిల్లా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు బీ ఫారాలను ఆదివారం అందజేసింది. వీటిని తీసుకునేందుకు ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు ఆదివారం ఉదయమే అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూఖ్, భూమా అఖిలప్రియ, జయసూర్య బీ ఫారాలను చంద్రబాబు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు అభ్యర్థులతో మాట్లాడుతూ రాష్ట్ర పునః నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని ప్రమాణం చేయించారు. పార్టీ గెలుపు కోసం నేతలంతా సమష్టిగా కృషి చేయాలని, ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని అన్నారు. అలాగే ఎన్నికల్లో పదునైన వ్యూహాలు అనుసరించి గెలిచి రావాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. నేడు చంద్రబాబు శ్రీశైలం పర్యటన ఉండటం వల్ల బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆ ఏర్పాట్ల హడావుడిలో అమరావతి వెళ్లలేకపోయారు. స్వామి వారి సన్నిధిలోనే చంద్రబాబు బుడ్డాకు బీ ఫారం అందజేయనున్నారని సమాచారం. బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అనివార్య కారణాల వల్ల బీ ఫారం తీసుకోడానికి వెళ్లలేదు.



చంద్రబాబు నుంచి బీ ఫారాలను అందుకున్న జిల్లా టీడీపీ అభ్యర్థులు

అరాచకాలు, హత్యలు, దౌర్జన్యాలు

- ఐదేళ్ల జగన్ పాలన తీరిది
- నంద్యాల, నందికొట్కూరులో వైఎస్ షర్మిల



నందికొట్కూరులో అభిమానులకు వైఎస్ షర్మిల అభివాదం

నంద్యాల టౌన్/నందికొట్కూరు, ఏప్రిల్ 21: అరాచకాలు, హత్యలు, దౌర్జన్యాలు తప్పా ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిందీ ఏమీ లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆదివారం నంద్యాల, నందికొట్కూరులో వైఎస్ షర్మిల 'ఏపీ న్యాయయాత్ర' బహిరంగ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులను గాలికొదిలేసిన వీళ్లా ఆయన ఆశయాలను నిలబెట్టేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం నందికొట్కూరులో ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా చేపట్టిందా? అని ప్రశ్నించారు. నందికొట్కూరులో సాగు, తాగునీరుకు దిక్కులేదు అన్నారు. మంచి వారు రాజకీయాల నుంచి తప్పుకుంటే గుండాలు, రౌడీలు రాజ్యమేలుతారని అన్నారు. ఓటుకు మూడు వేలు... ఐదు వేలు పెట్టి శిల్పా నంద్యాల ఓట్లన్నీ కొనేస్తారంట.. ఇది నిజమేనా అంటూ షర్మిల శిల్పా కుటుంబంపై విరుచుకుపడ్డారు. ఏ కాంట్రాక్టు అయినా వారికే, ఏ లేఅవుట్ అయినా వాళ్ళదే పరిమిషన్ కావాలని, కమీషన్లు ఇవ్వాలంటా, అన్నింటినీ మించి అత్యాచారాలు ఇలా కథలు కథలుగా శిల్పా కుటుంబం గురించి ప్రజలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కానిస్టేబుల్ సురేంద్రను చంపేస్తే, న్యాయం జరగలేదని, ఒక కానిస్టేబుల్ కుటుంబానికే న్యాయం జరగలేదంటే ఇక సామాన్య ప్రజలకు న్యాయం ఏం జరుగుతుందన్నారు. కానిస్టేబుల్‌ను చంపింది శిల్పా అనుచరులని, చంపిన వారు జైలులో ఉంటే చూడటానికి ఎమ్మెల్యే శిల్పా రవి జైలుకు వెళ్ళడం దుర్మార్గమని అన్నారు. ఓ ముస్లిం కుటుంబం మొత్తం వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్నారని, ఇన్ని హత్య చేసినా, మైనర్ బాలికల రేప్ కేసులు జరిగినా, అరాచకం జరుగుతున్నా శిల్పాపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా పడకపోవడానికి కారణం అధికారంలో ఉండటమేనని ఎద్దేవా చేశారు. ప్రజల ఓట్లతో గెలిచి, అధికారం అనుభవించి, దౌర్జన్యాలు, అరాచకం సాగిస్తున్న శిల్పా కుటుంబ సభ్యులకు తిరిగి జగన్ సీటు ఇవ్వడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లక్ష్మీనరసింహ యాదవ్, ఆర్థర్, గోకుల్ కృష్ణా రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, సీపీఎం నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు రంగనాయకులు, రఘురాంమూర్తి, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షర్మిల

ధన బలంతో విర్రవీగుతున్న శిల్పా

నంద్యాలలో, శ్రీశైలం నియోజకవర్గాల్లో శిల్పా కుటుంబం ధన బలంతో విర్రవీగుతున్నదని డీసీసీ అధ్యక్షుడు, ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. వైఎస్ ఆశయాలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఏనాడూ స్థానిక సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తలేదని విమర్శించారు. ఓట్లను డబ్బుతో కొన్నామంటూ శిల్పా కుటుంబం సాగిస్తున్న దౌర్జన్యాన్ని ప్రజలు ఓటుతో చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీగా తనను గెలిపించాలని, ప్రజా సమస్యలు, నిరుద్యోగ సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతానని అన్నారు. సండే ఎమ్మెల్యేకు ఓటు వేయవద్దని నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి గోకుల్‌కృష్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.



ఎలక్షన్లు వ్యాపారంగా మారాయి. రూ.కోట్లు గుమ్మరించే వాళ్లకే టికెట్లు దక్కుతున్నాయి. రియల్టర్లు, కాంట్రాక్టర్లే ఇప్పుడు నాయకులవుతున్నారు. పార్టీలు అలాంటి వారినే ఏరికోరి టికెట్లు ఇస్తున్నాయి. ఇలాంటి వారంతా రాజకీయాల్లోకి రావడంతో ఎన్నికలంటేనే డబ్బులు అనే పరిస్థితి వచ్చింది. ముందుగా రూ.కోట్లు చల్లేస్తున్న నాయకులు ఆ తరువాత ఆ డబ్బును రాబట్టుకునే పనిలో పడుతున్నారే తప్ప ప్రజలకు సేవ చేయడం లేదు. ఇసుక, లిక్కర్ మాఫియాలుగా మారి అందినకాడికి దోచుకునే పనిలో పడుతున్నారు. అభివృద్ధి అనే మాటే లేకుండా చేస్తున్నారు.

కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):



మారాల్సింది ఓటరే..!

- ఎలక్షన్లు వ్యాపారమాయే..
- రూ.కోట్లు గుమ్మరించే వాళ్లకే టికెట్లు
- ఎవరెంత ఎక్కువ ఖర్చు చేస్తే వారిదే గెలుపు
- రియల్టర్లు, కాంట్రాక్టర్లను ఏరికోరి టికెట్లు ఇస్తున్న పార్టీలు
- ప్రజాస్వామ్యమా.. ధనస్వామ్యమా..?

1952లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆనాడు ప్రజాసేవలో పరితపించే సేవకులు.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులను ఓటర్లు గుర్తించి తమ ప్రతినిధులుగా చట్టసభలకు పంపారు. 1972, 1978 ఎన్నికల వరకు జరిగిన ఎన్నికల్లో కాస్త అటు ఇటుగా ఆ విధానమే ఓటర్లు.. పార్టీల నాయకులు కొనసాగిస్తూ వచ్చారు. 1983 తర్వాత రాజకీయ పార్టీల్లోనూ.. రాజకీయ నాయకుల్లోనూ.. ఓటర్ల ఆలోచన విధానంలో కొంత మార్పు మొదలైంది. ప్రచారం పోకడలు మారిపోయాయి. ప్రజాసేవకులు ఎన్నికలకు దూరమవుతూ వచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేల పదవులు ధనవంతుల ఇళ్లకు చేరాయి. ప్రజాశ్రేయస్సు కోసం ఖర్చు చేయాల్సిన ధనమంతా ఎన్నికల్లో గెలవడానికి పదులు, వందల కోట్ల రూపాయలు నీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. నీచ, దుష్ట సంస్కృతికి 'రెడ్ కార్పెట్' వేసి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చేశారు.



అభివృద్ధి ఊసేదీ..!

యాభైయేళ్ల వెనక్కి వెళితే.. ఆనాటి పాలకులు శాశ్వత అభివృద్ధిపై దృష్టి సారించేవారు. ఆ పనుల్లోనూ నిజాయితీ నిష్పక్షపాతం ఉండేది. కృష్ణా నదిపై శ్రీశైలం ప్రాజెక్టు, తుంగభద్ర నదిపై తుంగభద్ర ప్రాజెక్టు నిర్మించారు. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ కృష్ణా జలాలు కరువు నేలకు మళ్లించాలని తప్పించారు. ఆ ఫలితమే తెలుగుగంగ ప్రాజెక్టు, హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు పురుడు పోసుకున్నాయి. రాయలసీమలో కరువు పల్లెల్లో కొంతైనా సాగునీరు అందుతోంది. కరువు పల్లెజీవుల దాహం తీరుతోందంటే ఆనాటి పాలకుల చలువే. ఆ చిత్తశుద్ధి నేటి పాలకులకు ఏదీ..? అనే ప్రశ్నలు వెలువెత్తుతున్నాయి. దీనికి ఒకటే సమాధానం. నాడు ధన వ్యయం లేకుండా ఎన్నికైనా ప్రజాప్రతినిధులు ప్రగతిపై దృష్టి పెట్టారు. నేడు ఆ పరిస్థితి ఉందా..? పంచుడు.. ఆ తర్వాత దంచుడే తప్ప. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును రాబట్టుకోవడానికి సహజ వనరులను చెరబడుతున్నారు... కొల్లగొడుతున్నారు. ప్రైవేటు ఆస్తుల్లో లిటికేషన్లు పెట్టి సెటిల్మెంట్ పంచాయితీల పేరిట లాగేసుకుంటున్నారు. సామాన్య ప్రజల కనీస అవసరాలైన సేవా రంగాలు విద్య.. వైద్యం.. మంచినీళ్లు.. రవాణా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. వ్యాపారంగా మార్చేశారు. అసలైన అభివృద్ధి ఏదీ..? సమాధానం దొరకని ప్రశ్న ఇది.

ఓటు అమ్ముకుంటే..!



వ్యాపారంలో పెట్టుబడి పెడితే.. రాబడి ఉంటుందని సామాన్య వ్యక్తిని అడిగినా ఇట్టే చెప్పేస్తాడు. రాజకీయాల్లో పెట్టుబడి పెడితే..? ఆ డబ్బు రాబట్టుకోవడానికి ఏం చేస్తాడు..? ప్రజాస్వామ్య ముసుగేసుకుని ప్రజలపై పడి దోపిడీ చేయడం తప్పా..! అందుకే ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఏమున్నది గర్వకారణం.. సమస్తం భూకబ్జాలు, పెట్రేగిపోతున్న ఇసుక, మట్టి, మద్యం మాఫియా.. ప్రతి పనికి ఓ రేటు కట్టి జనం ముక్కుపిండి వసూలు చేయడం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడే కరువు అయ్యారు. ఆ ఫలితమే.. అన్నదాతలు, చేనేతలు, బతుకుపోరులో అలసిసొలసిన అభాగ్యులు.. చివరికి విద్యార్థుల ఆత్మహత్యలు.. బలవన్మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. తామేదో ఉద్ధరించినట్లు ఓ చేత్తో బటన్ నొక్కి పైసలు పంచుతూ.. మరో చేత్తో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు బాదేస్తూ సగటు జీవులను పట్టి పీడించడం పాలకులకు వంతుగా మారింది. ఇది తప్పు అంటూ ప్రశ్నించే ప్రజాస్వామ్యవాదులు.. సామాజికవేత్తలపై రాజద్రోహం కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. కొవిడ్ సమయంలో మాస్కేది..? అని ప్రశ్నించిన ఓ దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను హింసించి.. వెంటాడి.. వేటాడి.. చివరకు పిచ్చోడు అనే ముద్రవేసి చంపేసిన ఘటన కళ్లముందే ఉంది. నోటుకు ఓటు అమ్ముకుంటే.. ఫలితాలు ఇలానే ఉంటాయని మానవ హక్కుల నేతలు గగ్గోలు పెడుతున్నారు.

మార్పు ఎవరిలో...

రాజకీయ నాయకులు డబ్బులిస్తానన్నారు.. మేము తీసుకుంటున్నాం.. మేమేమైనా వాళ్ల ఇళ్ల కాడికి పోయి డబ్బులిస్తేనే ఓట్లేస్తామని ఏనాడైనా అడిగినామా..? ఇది సామాన్య ఓటరు ప్రశ్న. ఇందులో నిజం లేకపోలేదు. పాతికేళ్ల క్రితం ఎలక్షన్లు జరిగిన తీరును పరిశీలిస్తే.. ఓటుకు డబ్బులిచ్చే సంస్కృతి లేదు. ఉదయమే ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో గ్రామ నాయకుడు ఓ చోట అల్పాహారం (టిఫిన్) పెట్టించేవాడు. మొదట్లో కూలీ పని వదులుకొని ఓటు వేయడానికి పేదలు వస్తున్నారని, కూలి డబ్బు కింద పదో పరకో ఇవ్వడం మొదలు పెట్టారు. అది కూడా అత్యంత నిరుపేదలకే. అలా మొదలైన డబ్బు పంపిణీ నోటుకు ఓట్లు కొనే స్థాయికి చేరింది.

ఎవరు ఎంత డబ్బు ఖర్చు చేస్తాడో.. ఆ అభ్యర్థే గెలిచే పరిస్థితికి తీసుకొచ్చారు. ఫలితంగా ప్రజా సేవ చేసేవాళ్లు.. ప్రజాస్వామ్యవాదులు ఎన్నికలకు దూరమయ్యారు. ధనవంతులు, కోటీశ్వర్లు, రియల్టర్లు, భూ కబ్జాలకోరులు.. బ్యాంకుల్లో రూ.వందల కోట్లు అప్పులు తీసుకొని ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాళ్లు ఎలక్షన్‌లో పోటీకి సై అంటున్నారు. రాజకీయ పార్టీల్లో కూడా రూ.కోట్లు ఖర్చు చేసేటోళ్లనే ఏరికోరి మరీ తమ అభ్యర్థులుగా పోటీకి దింపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ నాయకులు మారాలని కోరుకోవడం అవివేకమే అవుతుంది. మారాల్సింది ఓటర్లే. ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవాల్సింది ప్రజలే.

ఓటరన్నా ఎవరి పక్షమో..!

(కర్నూలు అర్బన్)



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సగటు ఓటరు నాడి అర్థంగాక బరిలో నిలిచిన అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల సీజన్‌లో ఓటర్లకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వారు అభ్యర్థులు ఏదడిగినా కాదనకుండా ఇచ్చేస్తున్నారు. డబ్బు, మందు, బిర్యానీ, ఇలా ఎవరికి నచ్చింది వారికి సిద్ధంగా ఉంచుతున్నారు. ఇదే అదనుగా భావించిన ఓటర్లు పార్టీలతో సంబంధ లేకుండా ఎవరూ పిలిచినా వెళ్లి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఒక రోజు తెలుగుదేశం, మరో రోజు ఇంకో పార్టీ ప్రచారంలోనూ కనిపిస్తున్నారు. ఏ పార్టీ ప్రచారంలో చూసినా జనాలు మాత్రం భారీగా దర్శనమిస్తున్నారు. అందరికీ జనాలు బాగానే వస్తుండడంతో అసలు ఓటర్లు ఎవరి పక్షాన ఉన్నారో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ఈ రోజు మెడలో వేసుకున్న కండువాను మరుసటి దినమే నీరు తాగినంత సులభంగా మార్చేస్తుండటంతో ఎవరు తమ వారు ఎవరు కాదనే విషయాన్ని తేల్చుకోవడం కష్టంగా మారింది. ప్రచారంలో జనం ఎక్కువగా కనిపిస్తే తాము బలంగా ఉన్నామనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుందని, తద్వారా గెలుస్తామని గట్టిగా నమ్ముతున్నారు. ఇదిలా ఉంటే ఓటర్లు మాత్రం నాయకులకు ఎన్నికల సమయంలో మాత్రమే తాము గుర్తుకు వస్తామని, గెలిచినా.. ఓడినా తమను ఎలాగు పట్టించుకోరు కాబట్టి ఎన్నికల సమయంలోనే ఇచ్చినంత పుచ్చుకోవాలని భావిస్తున్నారు.

పార్థసారథిపై కోడ్ ఉల్లంఘన కేసు


ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 21: ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఈ నెల 19న నామినేషన్ వేసే సమయంలో కోడ్ ఉల్లంఘించారని, ఆయనతోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గోపి తెలిపారు. నామినేషన్ దాఖలకు రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లేటప్పుడు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. అయితే ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఐదుగురి కంటే అధికంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లారని చెప్పారు. దీంతో సహాయ రిటర్నింగ్ అధికారి హసీనా సుల్తానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని, పార్థసారథితోపాటు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, గుడిసె కృష్ణమ్మ, బుద్ధారెడ్డి రామచంద్రపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


తెరపైకి టోకెన్ సంస్కృతి


ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21: ఎమ్మిగనూరులో తెరపైకి కొత్త సంస్కృతి వచ్చింది. సభలు, సమావేశాలకు వచ్చే జనాలకు అధికార పార్టీ టోకెన్లు ఇవ్వడం మొదలు పెట్టింది. కార్యక్రమం ముగిసిన తర్వాత టోకెన్ ఇచ్చిన వారికి ముందుగా నిర్ణయించిన మొత్తాన్ని ఇస్తున్నారు. దీంతో ఎక్కడ ఏ పార్టీ సమావేశాలు, సభలు, ర్యాలీలు జరిగినా టోకెన్లు ఎవరు ఇస్తారు.. ఎక్కడ ఇస్తారంటూ జనం ఎగబడుతున్నారు. ఇప్పుడు మిగతా పార్టీలు కూడా ఇదే దారి పట్టాయి. దీంతో ఏదో ఒక రాజకీయ పార్టీ సమావేశం ఏర్పాటు చేసిందంటే జనాలు ఆఘమేఘాలపై వెళ్లి టోకెన్లు తెచ్చుకుంటున్నారు. టోకెన్ ఉందంటే రూ.300 నుంచి రూ.500 వరకు చేతికి వచ్చినట్టే.

ఆ ముగ్గురికీ వాల్మీకి అభ్యర్థులే పోటీ

మంత్రాలయం, ఏప్రిల్ 21: మండలంలోని రాంపురంరెడ్డి సోదరులు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నుంచి ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి పోటీని ఎదుర్కొంటున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి బోయ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నుంచి పోటీ ఎదుర్కొంటున్నారు. ఆదోని నియోజకవర్గంలో వైసీపీ నుంచి సాయిప్రసాద్ రెడ్డి బరిలో దిగగా బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి పోటీలో ఉన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి వైసీపీ నుంచి వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తుండగా టీడీపీ నుంచి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంలను టీడీపీ అధిష్టానం బరిలో దింపింది. రాంపురంరెడ్డి సోదరులకు టీడీపీ నుంచి ముగ్గురు వాల్మీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే పోటీ ఇస్తుండటంతో ఆసక్తికరంగా మారింది.


రాఘవేంద్రరెడ్డి


జయరామ్


పార్థసారథి


బాలనాగిరెడ్డి


వెంకట్రామిరెడ్డి


సాయిప్రతాప్‌రెడ్డి

పునర్విభజనలో తొలి జెండా టీడీపీదే

మంత్రాలయం, ఏప్రిల్ 21: 2009 రాష్ట్ర పునర్విభజనలో మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంగా కొత్త నియోజకవర్గంలో మంత్రాలయం గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడింది. 2009లో మంత్రాలయం కేంద్రంగా కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాలను కలిపి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. గతంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి మండలాలు ఉండేవి. కౌతాళం మండలం మాత్రం ఆదోని నియోజకవర్గంలో ఉండేది. పునర్విభజనలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఆదోని నియోజకవర్గంలోని ఒక మండలాన్ని కలిపి కొత్త నియోజకవర్గం ఏర్పాటైంది. కొత్తగా ఏర్పడిన నియోజకవర్గంలో జరిగిన మొదటి ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన బాలనాగిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దళవాయి రామయ్యపై 10,697 ఓట్ల మెజారిటీతో మంత్రాలయం గడ్డపై తొలి టీడీపీ జెండా ఎగురవేశారు. అయితే.. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో బాలనాగిరెడ్డి కాంగ్రెస్‌లోకి వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కలిశారు. పీఆర్పీ నుంచి పోటీ చేసిన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రాఘవేంద్రరెడ్డి తండ్రి దివంగత మాధవరం రామిరెడ్డి రూ.10,176 ఓట్లతో సరిపెట్టుకున్నారు. దీంతో మంత్రాలయం తొలి నియోజకవర్గంలో తొలి టీడీపీ జెండా ఎగిరింది. అయితే.. బాలనాగిరెడ్డితోపాటు పీఆర్పీతో పోటీ చేసిన రామిరెడ్డి, కాంగ్రెస్ నుంచి ఓడిపోయిన దళవాయి రామయ్యతో జతకట్టి ముగ్గురు నేతలు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. 2009 సెప్టెంబరు 2న వైఎస్సార్ దుర్మరణం చెందడంతో ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంట వై.బాలనాగిరెడ్డి, రామిరెడ్డి నడిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి బాలనాగిరెడ్డి, ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షులు ప్యాలకుర్తి తిక్కారెడ్డి పోటీలో నిలబడగా.. బాలనాగిరెడ్డి తిక్కారెడ్డిపై 7,462 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. 2019లో ఇదే రిపీట్ అయి తిక్కారెడ్డిపై బాలనాగిరెడ్డి 23,879 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నిలిచారు. మంత్రాలయం నియోకవర్గంలో వాల్మీకి, కురువ, ఎస్సీ సామాజికవర్గాలు చెందిన ఓటర్లే అధికంగా ఎమ్మెల్యే అభ్యర్థిని ఇక్కడ శాసిస్తున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 2,07,682 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 1,05,827 మంది కాగా, పురుషులు 1,01,834 మంది ఉన్నారు. ఇతరులు 21 మంది ఉన్నారు. ఇందులో నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కౌతాళం మండలంలో 69, కోసిగి మండలంలో 62, మంత్రాలయం మండలంలో 57, పెద్దకడుబూరు మండలంలో 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వై.బాలనాగిరెడ్డి నాల్గవసారి వైసీపీ నుంచి బరిలో దిగుతుండగా.. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన దివంగత రామిరెడ్డి తనయుడు ఎస్.రాఘవేంద్రరెడ్డి పోటీల్లో ఉన్నారు. వీరిద్దరి మధ్య నువ్వా.. నేనా అన్న రీతిలో పోటీ నడుస్తోంది. ఇరువురు నేతలు ఒకరు బీసీ వాల్మీకి వర్గానికి చెందడం, ఈ నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గానికి చెందిన వాల్మీకి ఓటర్లు అత్యధికంగా ఉండటంతో టీడీపీ అభ్యర్థికి కలిసొచ్చే అవకాశాలు అధికంగానే ఉన్నట్లు సమాచారం. మంత్రాలయం రాఘవేంద్రుని ఆశీస్సులు ఎవరిపై ఉంటాయో మే 13న పోలింగ్ అనంతరం జూన్ 4న ఫలితాల్లో తేలనుంది.


మంత్రాలయం ముఖద్వారం

తాయిలాలు తీసుకున్నా నేరమే



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఎన్నికల్లో తాయిలాలు కీలకంగా మారాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెడుతూ మద్యం, నగదు, క్రీడా సామగ్రి, చీరలు, గృహోపకరణాలు తదితర వస్తువులు ఇస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం తాయిలాలు ఇచ్చిన వారితోపాటు తీసుకున్నా నేరమే. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123 ప్రకారం తాయిలాలు ఇచ్చేవారు, స్వీకరించేవారు కూడా నిందితులే. సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసి నిరూపించగలిగితే.. చట్టప్రకారం శిక్షార్హులవుతారు. ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు వేయాలంటూ ఎన్నికల సంఘం ముద్రించిన కరపత్రాలను పోల్ చీటీలతో పాటు బీఎల్వో ఓటర్లకు అందజేస్తున్నారు. ప్రలోభాలపై ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నెంబర్.1950కి ఫిర్యాదు చేయవచ్చు.

దొంగ ఓట్లు కనిపెట్టేయండిలా...



దొంగ ఓట్లను సులభంగా కనిపెట్టేయవచ్చు. ఇందు కోసం గూగుల్ వెబ్ బ్రౌజర్‌లో ceoap-erolls.ap.gov.in/ namesearch/ నొక్కండి.. 'ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్' పేరుతో ఉన్న పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో మీ జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. హౌస్ నెంబర్ ఆప్షన్‌లో మీ ఇంటి డోర్ నెంబరు నమోదు చేయాలి. 'క్యాప్చా' ఎంటర్ చేసి సెర్చ్ కొడితే చాలు.. ఆ ఇంటి నెంబరులో మొత్తం ఎంత మంది ఓటర్లు ఉన్నారు..? వారి పేర్లు వయస్సు, ఓటరు కార్డు నెంబరు, వారి పోలింగ్ కేంద్రం నెంబరు, వారి ఓటరు వరుస నెంబరు వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. మీ ఓటు కూడా కనిపిస్తుంది. మీ కుటుంబ సభ్యుల పేర్లు కాకుండా.. అపరిచితుల పేర్లు ఉంటే అవి దొంగ ఓట్లు కింద లెక్క. వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడమే. ఒకవేళ ఆ డోర్ నెంబరులో గతంలో మీ ఓటు ఉండి.. ఇప్పుడు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లే.. కొత్త ఓటు నమోదు చేసుకోవాలి.

-కర్నూలు కలెక్టరేట్

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవ్..!



గుర్తులు లేకుండా ఎన్నికలు ఏంటా అని సందేహం రావొచ్చు. ఇది నిజమే. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తారు. అంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందజేసేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి వారి ప్రాంతాల్లో పోటీ చేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

- కర్నూలు కలెక్టరేట్

డిపాజిట్ ఎంతంటే..!



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారంతో పాటు నిర్ణీత డిపాజిట్ (ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఎంపీ అభ్యర్థులైతే రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.12,500లు, అసెంబ్లీ అభ్యర్థులైతే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎన్నికల్లో పోలైన వాటిలో చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు మించితే ఆ అభ్యర్థి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేకుంటే ఆ డిపాజిట్‌ను ఎన్నికల సంఘమే జప్తు చేసుకుంటుంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితం చేసిన తర్వాత మాత్రమే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్ తిరిగి ఇచ్చేస్తారు.


- కర్నూలు కలెక్టరేట్

మీకు ఏం కావాలో చెప్పండి



ఆదోని, ఏప్రిల్ 21: ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు పట్టణ శివారున అభివృద్ధి కానీ కాలనీలపైనే ప్రత్యేక దృష్టి సారించారు. మామూలు రోజుల్లో ఆ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడని నాయకులు ఇప్పుడు వారిని ఆకట్టుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వారిపై ఉన్నట్లుండి ప్రేమ ఒలకబోస్తున్నారు. వారితో కలిసి ఫొటోలు దిగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తుండగా, ప్రతిపక్ష అభ్యర్థులు వారు చేయబోయే పనులకు గురించి వివరిస్తున్నారు. పట్టణ శివారు కాలనీలో నివసించేవారిలో 60 శాతం మంది పోలింగ్‌లో కచ్చితంగా పాల్గొంటున్నారు. అభ్యర్థుల గెలుపోటములలో వీరు కీలకమవుతున్నారు. ఈ విషయాన్ని గమనించి అభ్యర్థులు శివారున ఉన్న కాలనీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆ కాలనీలో తాము చేపట్టనున్న కార్యక్రమాలు వివరిస్తూ వారి మద్దతు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. వారితో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ ఓటర్ల సంఖ్యను బట్టి నాయకులకు డబ్బు ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది.

మాట ఇచ్చి మడమ తిప్పారు..



ఆదోని, ఏప్రిల్ 21: మాట ఇచ్చి అప్పుడే మడమ తిప్పేశారు. మా పార్టీలోకి వస్తే ఏమోమో చేస్తామని చెప్పి అప్పుడే ముఖం చాటేస్తున్నారు. ఈ మాటలు నమ్మి సదరు నాయకుల కండవాలు కప్పేసుకున్నారు. పార్టీ మారడానికి కుదుర్చుకున్న డీల్‌ను వెంటనే సెటిల్ చేస్తారని భావించారు. తర్వాత పట్టించుకునే వారే లేదు. పలకరించేవారు కరువయ్యారు. ఆదోని డివిజన్ పరిధిలోని ఆ వ్యక్తి ప్రధాన పార్టీకి టికెట్ ఆశించారు. దక్కలేదు. ప్రత్యర్థి పార్టీ గాలం వేసింది. పార్టీ మారగానే కొన్ని ప్యాకేజీలు, అధికారంలోకి రాగానే పదవులు ఇస్తామని హామీ ఇచ్చింది. సదరు వ్యక్తి వెనువెంటనే ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. రోజులు గుడుస్తున్నా ప్యాకేజీ అందలేదు... పోని ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారో తెలుసుకుందామని ప్రయత్నిస్తే ఎవ్వరూ స్పందించడం లేదు. ఆర్థికపరమైన హామీకి సంబంధించి ఫలానా వ్యక్తి తీరుస్తాడంటూ పార్టీ నేతలు చెప్పారు. ఆయన కూడా పట్టించుకోవడం లేదు. దీంతో సదరు నేత ఎరక్కపోయి ఇరుక్కుపోయానన్న భావనలో ఉన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం

● నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పిలుపు ● జయసూర్యను గెలిపించాలని విజ్ఞప్తి ● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



అల్లూరులో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



నందికొట్కూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాండ్ర

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 21: వైసీపీని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అల్లూరులోని మాండ్ర స్వగృహంలో మల్యాల గ్రామ టీడీపీ నాయకులు మద్దిలేటి, బాలమద్దయ్య ఆధ్వర్యంలో ఆ గ్రామ వైసీపీ నాయకులు మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. చిన్నమౌళాలి, గఫార్ ఖాన్,చాంద్ బాషా, సయ్యద్ బాషా, మద్దిలేటి, నాగన్న, మధు, బాలు, బోయ రాము తదితరులతోపాటు మరికొంతమంది టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

● మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో అల్లూరు గ్రామ టీడీపీ నాయకులు మాండ్ర రమణారెడ్డి, గోవిందరాజు ఆధ్వర్యంలో అల్లూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. రాంబాబు, జయన్న, వెంకటరమణ, మహేష్, మద్దిలేటి, శివన్న, రాముడు, బోయ వెంకటరమణ, శ్రీనివాసులు, తదితరులతో పాటుగా మరికొంత మంది టీడీపీలో చేరారు.

● మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో పాములపాడు మండలం టీడీపీ నాయకుడుసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో క్రిష్ణానగర్ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మాండ్ర మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి కోరుకుంటున్నారన్నారు. ఒక్కచాన్స్ అంటూ వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. అన్నిరకాలుగా రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. మళ్లీ వైసీపీకి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మడం ఖాయమని తెలిపాడు. అందుకే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే కచ్చితంగా టీడీపీ రావాలన్నారు. కార్యకర్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: టీడీపీతోనే నందికొట్కూరు నియోజకాభివృద్ధి సాధ్యమని టీడీపీ నంద్యాల లోక్ సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. పట్టణంలోని 7వ వార్డు ఇన్‌చార్జి సోదీ చాంద్ తదితరుల ఆధ్వర్యంలో బాబు సూపర్ సిక్స్ పథకాలను, శంఖారావం కార్యక్రమాలను నిర్వహించారు. మాండ్ర ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాండ్ర మాట్లాడుతూ స్థానికుడైన జయసూర్యను గెలిపించుకుంటే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. స్థానికేతరులను గెలిపించుకుంటే నియోజకర్గం అభివృద్ధి చెందదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముత్తుజావలి, షకీల్‌అహ్మద్, కుమార్, సత్తార్మియా, వహీద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని కడుమూరు గ్రామంలో మార్కెయార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో ఆదివారం మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డితో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. షఫీవుల్లా బ్రదర్స్, ఇషాక్, అబ్దుల్ రెహమాన్, రామసుబ్బయ్య, రామచంద్రుడు, మద్దిలేటి, పుల్లయ్య తదితరులకు మాండ్ర కండువా కప్పి ఆహ్వానించారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, శివరామరెడ్డి, సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడుమూరు గ్రామంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

జగన్‌కు ఓటేస్తే రాష్ట్రం సర్వనాశనం: షర్మిల



బ్రాహ్మణకొట్కూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 21: వైఎస్ జగన్‌కు మళ్లా ఓటేస్తే రాష్ట్రం సర్వనాశనం ఖాయమని ఏపీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. షర్మిల రోడ్ షో ఆదివారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరుకు మీదుగా కొనసాగింది. బ్రాహ్మణకొట్కూరులో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు, నంద్యాల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులు గజమాలతో స్వాగతం పలికారు. షర్మిల కొద్దిసేపు గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నందికొట్కూరు టీడీపీ అభ్యర్థిగా గిత్తా జయసూర్య నామినేషన్



నందికొట్కూరు, ఏప్రిల్ 21: టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గం అభ్యర్థిగా సోమవారం గిత్తా జయసూర్య నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు బయలుదేరి నందికొట్కూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసుకు నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు.

నంద్యాల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్



షర్మిల నుంచి బీ ఫారం అందుకుంటున్న లక్ష్మీనరసింహ యాదవ్



బీ ఫారం అందుకుంటున్న శ్రీశైలం అభ్యర్థి ఇస్మాయిల్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 21: నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహ యాదవ్‌ను అధి ష్ఠానం ఖరారు చేసింది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏపీ న్యాయయాత్రలో భాగంగా బస్సు యాత్ర జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజునే జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌ను ఖరారు చేయడంతో పాటు బీ ఫారంను కూడా అందజేశారు. ఇప్పటికే నంద్యాల అసెంబ్లీ నుంచి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు నుంచి తొగూరు ఆర్థర్‌ను ప్రకటించారు. తాజాగా ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌తో పాటు డోన్ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటి స్వామి, ఆళ్లగడ్డ అభ్యర్థిగా బి.హుసేన్‌బాషా, శ్రీశైలం అభ్యర్థిగా సయ్యద్ ఆసర్ ఇస్మాయిల్, బనగానపల్లె అభ్యర్థిగా గూటం పుల్లయ్య (బాలు యాదవ్)లను ప్రకటిస్తూ బీ ఫారంలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అందజేశారు.

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సున్నిపెంటకు చెందిన ఇస్మాయిల్‌ను ఎంపిక అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈమేరకు ఆదివారం కర్నూలుకు విచ్చేసిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా ఇస్మాయిల్‌కు బీ-ఫారమ్‌ను అందజేశారు.

వెంగళరెడ్డిపేటలో పిడుగుపాటు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 21: మండలంలోని వెంగళరెడ్డిపేటలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. ఆదివారం ఉదయం నుంచి ఉష్ణోగ్రత బాగానే ఉంది. అయితే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆకాశంలో మేఘాలు కమ్మి, ఉరుములు ఉరిమాయి. ఈదశలో వెంగళరెడ్డిపేటలోని కాశిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. చెట్టు నుడిలో మంటలు మండాయి. వెంటనే స్థానికులు నీరు చల్లి మంటలను ఆర్పారు. పక్కనే గడ్డివాములు, పశువులపాకలు ఉండటం మంటలు పక్కకు వ్యాపించకుండా మంటలు ఆర్పారు.

మమ్మల్ని పట్టించుకోరా?

● నంద్యాల ఎమ్మెల్యేపై సీనియర్ కార్యకర్త అసంతృప్తి

నంద్యాల నూనెపల్లి, ఏప్రిల్ 21: నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పదోవార్డులోని తమ వర్గాన్ని అసలు పట్టించుకోవడం లేదని ఆ వార్డు వైసీపీ సీనియర్ కార్యకర్త వంకధార విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శిల్పా కుటుంబం రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పటి నుంచి పార్టీ విధేయుడిగా, అభిమానిగా, కార్యకర్తగా కొనసాగామని చెప్పారు. అయితే పదో వార్డు కౌన్సిలర్ మజీద్ వర్గానికే అధిక ప్రాధాన్యత కల్పిస్తూ తమ వర్గాన్ని పట్టించుకోకుండా ఉండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు ప్రజలతో చర్చించి టీడీపీలోకి వెళ్లేలా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం.. నేలకొరిగిన స్తంభాలు

గడివేముల, ఏప్రిల్ 21: మండలంలోని తిరుపాడు, కొరటమద్ది, దుర్వేసి గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. తిరు పాడు గ్రామంలోని రహదారి వెంట ఉన్న హోటళ్ల పైకప్పులు ఎగిరి పోయాయి. కొరటమద్ది గ్రామ శివారులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయామని తిరుపాడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

మహానందిలో ఎన్నికల పరిశీలకుడు

మహానంది, ఏప్రిల్ 21: మహానంది క్షేత్రంలో కడప జిల్లా ఎన్నికల పరిశీలకుడు రాజేష్ కుమార్ మీనా(ఐఆర్ ఎస్) ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

CHANGE OF NAME

I, **APSAR BASHA** (Old Name) R/o.H.No:41-473-3, Saibaba Sanjeevayya Nagar, Kurnool dist, AP., have changed my name as **SHAIK APSAR BASHA** (New Name) S/o.S ABDUL RAWOOF

AJL-180248

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 176988

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

టీడీపీని ఆదరించండి: బైరెడ్డి



మిడుతూరులో పర్యటిస్తున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

మిడుతూరు, ఏప్రిల్ 21: టీడీపీని ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మిడుతూరు బస్టాండు ఆవరణం, బీసీ కాలనీ, పింజరి వీధుల్లో పర్యటించారు. ఎంపీగా బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. మండల కేంద్రం మిడుతూరు గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు కాతా రమేశ్ రెడ్డి, కాతా రాములు రెడ్డి, బన్నూరు శ్రీనివాసులు రెడ్డి, బన్నూరు చంద్రారెడ్డి, తువ్వా భగీరథ రెడ్డి నివాసాలకు వెళ్లి టీడీపీ నంద్యాల లోక్‌సభ అభ్యర్థి బైరెడ్డి శబరి సోమవారం నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అనంతరం విలేకరుల సమావేశంలో బైరెడ్డి రాజశఖర రెడ్డి మాట్లాడుతూ మండలంలో టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు. మిడుతూరు మండలానికి తాగు నీటి సమస్య తీర్చటానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, ప్రతి గ్రామానికి రోడ్లు, ఇళ్లు లేనివారికి ఇళ్లు, పొదుపు మహిళలకు పసుపు కుంకుమ, అలగనూరు బ్యాన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులు, ప్రపంచంలో ఎక్కడా లేని రోళ్లపాడు బట్టమేక పక్షి అభయారణ్యంను గుర్తించి సందర్శ కేంద్రంగా టీడీపీ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. ఈ రోజు వైసీపీ ప్రభుత్వ పాలనలో కుంగిన రిజర్వాయర్‌ను బాగు చేయలేక అందులో దోసెడు నీళ్లు కూడా లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గుండం స్వామి రెడ్డి, యరభం హరిసర్వోత్తమరెడ్డి, పూల మౌలాలి, మద్దూరు కృష్ణారెడ్డి కాల రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు: ఎస్పీ



చిందుకూరు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం/గడివేముల, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత పోలింగ్ నిర్వహించేందుకే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామి, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యా త్మక గ్రామాలైన చిందుకూరు, పెసరవాయిలో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. నంద్యాల డీఎస్పీ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ వెంకట సుబ్బయ్య, కేంద్ర సాయుధబలగాలతో నిర్వహిం చిన కవాతులో ఎస్పీ మాట్లాడారు. ప్రజలు సంయమనం పాటించి ప్రశాంతపోలింగ్‌కు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు.

శ్రీశైలంలో పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

సంగమేశ్వరంలో 16 సోమవారాలు పూజలు

కొత్తపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని సప్తనదుల సంగమేశ్వరంలో ఈ నెల 22వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 16 సోమవారాలు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు తెలకపల్లి రఘురామ శర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయం బయల్పడిన తర్వాత గత 21 సంవత్సరాలుగా క్షేత్రంలో 16 సోమవారాల పూజలు యథావిధిగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యథావిధిగా శివునికి ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో ఇలా 16 సోమవారాలు విశేష పూజలు, అభిషేకాలు వంటి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఏటా సంగమేశ్వరాలయం 8 నెలల పాటు నది గర్భంలో నిక్షిప్తమై ఉంటుందని, ఈ ఏడాది మాత్రం కేవలం 4 నెలలు మాత్రమే నది గర్భంలో ఉందని అర్చకుడు తెలిపారు.

తాగునీరు అందేదెన్నడో?

● నిలిచిపోయిన అలగనూరు తాగునీటి పథకం

● టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తి

● పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

● తాగునీటి సమస్యతో ప్రజల అవస్థలు



మంటల్లో కాలిపోయిన పైపులు



అలగనూరు రిజర్వాయర్ వద్ద కంప చెట్లలో కూరుకుపోయిన పంప్ హౌస్

మిడుతూరు, ఏప్రిల్ 21: మండలంలోని 10 గ్రామాలకు నీటిని అందించేందుకు చేపట్టిన తాగునీటి పథకం పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మిడుతూరు మండలంలో ప్రతి ఏటా వేసవిలో నీటి సమస్య తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వం తాగు నీటి పథకాన్ని మంజూరు చేసింది. అయితే ఎనిమిదేళ్లు కావస్తున్నా తాగు నీటి పథకం నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాగనీటి పథకం నిర్మాణం కోసం రూ.14.5 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ(ఎస్‌డీపీ) నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద 2017 జనవరిలో సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం పనులు, గ్రామీణ నీటి సరఫరా పథకం పనులు, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. తాగునీటి పథకం పనుల్లో భాగంగా పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్లను నిర్మించారు. ఈ తాగునీటి పథకం పనులు 2017 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. గడువు ముగిసి పనులు పూర్తి చేయకపోవడంతో 2018 వరకు గడువు పొడిగించాలని అధికారులు కోరారు. అయితే అధికారులు కోరిన గడువు కూడా ముగిసింది. పనులు మాత్రం సుమారు 70 శాతం వరకు తాగునీటి పథకం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం పూర్తయితే మండలంలోని అలగనూరు, రోళ్లపాడు, తలముడిపి, జలకనూరు, ఖాజీపేట, దేవనూరు, గుడిపాడు, 49 బన్నూరు, చౌట్కూరు, కడుమూరు గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. కానీ ఈ రోజు తాగునీటి పంప్ హౌస్, బెడ్ల నిర్మాణం జరిగిన ప్రదేశం కంప చెట్ల మధ్యలో శిథిలావస్థకు చేకుంది. కొందరు ముళ్ల కంపను కాల్చే క్రమంలో మంటల్లో అక్కడ ఉన్న నీటి సరఫరా చేసే పైపులు కాలిపోయాయి. నాయకులు, అధికారులు స్పందించి తాగునీటి పథకాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అలగనూరు తాగునీటి పథకం గురించి పట్టించుకోలేదు. దీంతో తాగునీటి పథకం పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తి



టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా అలగనూరు బ్యాలన్సింగ్ రిజర్వాయర్ ద్వారా నీటిని పంపింగ్ చేసి గ్రామాలకు తాగు నీటి సమస్య తీర్చటానికి 70 శాతం పనులు పూర్తి చేసింది. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కుంగి పోయిన అలగనూరు రిజర్వాయర్ పనులు చేపట్టలేదు. అలగనూరు తాగునీటి పథకం పనులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. టీడీపీ ప్రభుత్వం వస్తే నాయకుల దృష్టికి తీసుకుపోయి అలగనూరు రిజర్వాయర్ రిపేరు చేయించి, తాగు నీటి పథకం పనులు పూర్తి చేసి గ్రామాల్లో తాగు నీటి సమస్యల లేకుండా చేస్తాం.

కాతా రమేశ్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్

వైసీపీ అభ్యర్థి శిల్పాపై చర్యలు తీసుకోవాలి

● రిటర్నింగ్ ఆఫీసర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు



శ్రీశైలం ఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 21: శ్రీశైల మహాక్షేత్రంలో దేవదాయశాఖ నిబంధనలను ఉల్లంఘించి ఎన్నికల ప్రచారం నిర్వహించిన శ్రీశైలం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి శాఖమూరి గిరిరాజు, టీడీపీ పట్టణాధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్ శ్రీశైలం ఆర్వో సుధారాణికి ఆదివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. దేవదాయశాఖ చట్టం ప్రకారం శ్రీశైల దేవస్థానం పరిధిలో రాజకీయ పార్టీల ప్రచారాలు, జెండాలు, ఫ్లెక్సీలు, ప్రచార రథాలు, అన్యమత చిహ్నాలు ఉపయోగించరాదని తెలిపారు. అయితే ఆదివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దౌర్జన్యంగా శ్రీశైల దేవస్థానం పరిధిలో వైసీపీకి చెందిన ప్రచార రథంతో పాటు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, రాజకీయ పార్టీ నాయకుల ఫొటోలతో ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈవిషయంపై అక్కడి టీడీపీ నేతలు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో స్పందించిన రెవెన్యూ, పోలీసు అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి ఎమ్మెల్యే శిల్పా ప్రచారంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో అధికారులపైనే కేసులు పెడతానని ఎమ్మెల్యే శిల్పా బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించారు. అసలే ఆదివారం సెలవు దినం కావడంతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి భక్తులు భారీగా తరలివచ్చారని, ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శిల్పా చేసిన రాజకీయ ఎన్నికల ప్రచారం వల్ల వారికి ఇబ్బందిగా మారిందని వివరించారు. ఈవిషయాలన్ని మీడియా, సోషల్ మీడియా ద్వారా బహిర్గమైందని గుర్తుచేశారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల ప్రచారానికి వినియోగించిన ప్రచార రథాన్ని సీజ్ చేయాలని కోరారు.

'ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి'

పాణ్యం, ఏప్రిల్ 21: ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సమాజ్‌వాది పార్టీ పాణ్యం అభ్యర్థి పెరుగు శివకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పాణ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు బహుజనుల కోసం పార్టీలు పని చేయడంలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీల కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ అభ్యర్థి పాండురంగయాదవ్, నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఫరీదాబి, రియాజ్, అనిల్‌కుమార్, సురేష్‌బాబు, రామకృష్ణ, కృష్ణ, నాగేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

వెలుగోడు, ఏప్రిల్ 21: వెలుగోడు పట్టణ శివార్లలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ నళిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. 6వ తరగతిలో చేరేందుకు 189 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 171 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె వివరించారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో చిన్నమద్దిలేటి పరిశీలించారు. 175 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 167 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రమేష్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని పాతమడుగుల గిరిజన గూడేనికి చెందిన ఐలేని తిక్కస్వామి (25) ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు తెలిపిన వివరాలివీ.. తిక్కస్వామి ఉగాది పండుగ రోజున ఖర్చుల నిమిత్తం రూ.2వేలు ఇవ్వాలని తండ్రి హుశేనయ్యను ఒత్తిడి చేశాడు. తన వద్ద డబ్బుల్లేవని, మళ్లీ ఇస్తానని చెప్పారు. అయితే అప్పటి నుంచి మనస్థాపానికి గురైన తిక్కస్వామి తరుచూ తండ్రితో గొడవపడేవాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కొత్తపల్లికి చెందిన బీసీ సంఘం నాయకులు నాగేశ్వరరావు యాదవ్, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసులు స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్లి పోస్టుమార్టం చేయించారు. యువకుడి తల్లిదండ్రుల దగ్గర కూడా చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో వారే ఖర్చుల నిమిత్తం ఇచ్చి మృతదేహాన్ని పాతమాడుగులకు తరలించారు. యువకుడి తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



పుట్టాలమ్మను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

పుట్టాలమ్మకు పూజలు

నంద్యాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని ఆర్‌క్రిష్ణాపురం సమీపంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు భక్తులు ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.



చాగలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమ్మకు..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని గ్రామ దేవత చాగలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు పుల్లయ్యశర్మ ఆధ్వర్యంలో చాగలమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పెద్దమకానం వీధి లోగల పెద్దమ్మకు మహిళలు బోనాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లింగమయ్యస్వామికి..

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలవు దీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామికి ప్రసాదం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తరలివచ్చిన భక్తులకు పూజల అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

టీడీపీలో చేరిక

దొర్నిపాడు, ఏప్రిల్ 21: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి మాజీ సర్పంచ్ పాదం శ్రీనివాసులు, శ్రీపతి మునయ్య, పగడాల శ్రీనివాసరావు, పగడాల ప్రతాప్, పగడాల రామకృష్ణ, రంగనాయకులుతో పాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, మల్లేశ్వరచౌదరి, నాయినిగారి శ్రీనివాసులు, సురేంద్ర, సత్యం, నారాయణ, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

నంద్యాల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్



షర్మిల నుంచి బీ ఫారం అందుకుంటున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 21: నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహ యాదవ్‌ను అధి ష్టానం ఖరారు చేసింది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏపీ న్యాయయాత్రలో భాగంగా బస్సు యాత్ర జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజునే జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌ను ఖరారు చేయడంతో పాటు బీ ఫారంను కూడా అందజేశారు. ఇప్పటికే నంద్యాల అసెంబ్లీ నుంచి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు నుంచి తొగూరు ఆర్థర్‌ను ప్రకటించారు. తాజాగా ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌తో పాటు డోన్ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటి స్వామి, ఆళ్లగడ్డ అభ్యర్థిగా బి.హుసేన్‌బాషా, శ్రీశైలం అభ్యర్థిగా సయ్యద్ అసర్ ఇస్మాయిల్, బనగానపల్లె అభ్యర్థిగా గూటం పుల్లయ్య (బాలు యాదవ్)లను ప్రకటిస్తూ బీ ఫారంలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అందజేశారు.

'అరాచక పాలనకు అంతం తప్పదు'



టీడీపీలో చేరిన వారితో భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, ఏప్రిల్ 21: వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఆదివారం వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, మల్లేశ్వరుడు, చక్రపాణి, శ్రీరామ, మహేష్‌తోపాటు 30 కుటుంబాలు జగత్ విఖ్యాతరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, అన్సర్‌బాషా, మస్తాన్, ఉసేన్ వలి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బయ్య, నరసింహులు పాల్గొన్నారు.

'ప్రజల చూపు టీడీపీ వైపే'

రుద్రవరం, ఏప్రిల్ 21: ప్రజల చూపు టీడీపీ వైపే ఉందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ఆదివారం టి.లింగం దిన్నె గ్రామస్థులు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగత్ విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా భూమా అఖిలప్రియ సోమవారం నామినేషన్ వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయ కులు భారీ సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి

CHANGE OF NAME

I, **APSAR BASHA** (Old Name) R/o.H.No:41-473-3, Saibaba Sanjeevayya Nagar, Kurnool dist, AP., have changed my name as **SHAIK APSAR BASHA** (New Name) S/o.S ABDUL RAWOOF

AJL-180248

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**

AJA- 176988

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

డోన్‌లో పోలీసుల కవాతు

డోన్(రూరల్), ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పట్టణంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వీధుల్లో కవాతు నిర్వహించారు.

కాటసానికి ఓటమి భయం

» టీడీపీలోకి వలసలు చూసి నిద్ర పట్టడం లేదు
» మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 21: బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, నియోజకవర్గంలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలను చూసి ఆయనకు, వైసీపీ నాయకులకు నిద్ర పట్టడంలేదని మాజీ ఎమ్మెల్యే, బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరారు. మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు, వైసీపీ బీసీ సెల్ జిల్లా నాయకుడు ఉలువల నరసింహుడు, కొలిమిగుండ్లకు చెందిన మాజీ సర్పంచ్ జడలమ్మగారి నాగరాజు, అంపినేని నరసింహులు, శ్రీనివాసులు, రమణ్యయ, తలారి రామసుబ్బయ్య, బేకరీ వెంకటేష్, పాములేటి, సత్యనారాయణ తదితర సుమారు 200 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరారు. అదేవిధంగా కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు, మీర్జాపురం గ్రామానికి చెందిన 20 వాల్మీకి కుటుంబాలు, గొల్ల వేణు, సుబ్బశేఖర్ తదితరులు మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన రెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. టీడీపీ బీసీల పార్టీ అని, వాల్మీకులు మద్దతు తెలపడం ఆనందంగా ఉందని అన్నారు. అధికారం చేపట్టిన తరువాత వాల్మీకులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, కామిని క్రిష్ణరంగారెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

65 కుటుంబాలు టీడీపీలో చేరిక

బనగానపల్లె: ప్రతిరోజు వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరుతుండడంతో వైసీపీకి షాక్ తగులుతోంది. ఆదివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బనగానపల్లె మండలం రామతీర్థం, కొలిమిగుండ్ల మండలం కోరుమానుపల్లె గ్రామాలకు చెందిన 65 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, రామతీర్థం మాజీ సర్పంచ్‌లు పెద్దమద్దిలేటి, రాముడుల ఆధ్వర్యంలో వీరు టీడీపీలో చేరారు. అదేవిధంగా కోరుమానుపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఓం నమోనారాయణ, ఆంథోనిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, శివనారాయణరెడ్డి, ప్రదీపకుమార్, నరేశ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, సూర్యనారాయణ, కిశోర్‌కుమార్, కోళ్ల బాషా, దస్తగిరి, ఆళ్లగడ్డ బాషా, వెంకటేశ్, రాఘవ తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు.



సంజామల మండలం గిద్దలూరులో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ

అన్నివర్గాలను మోసం చేసిన జగన్: బీసీ

ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు ఇవ్వకుండా సీఎం జగన్ మోసం చేశారని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆది వారం ప్రజాగళం కార్యక్రమంలో బనగానపల్లె పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సైకో జగన్ విద్యుత్ బిల్లులు భారీగా పెంచి పేదల నడ్డి విరిచారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు విద్యుత్ బిల్లులు దాటితే విద్యుత్ బిల్లులు కట్టాలని బెదిరిస్తున్నా రన్నారు. హుసేనాపురంలో జగన్ నిర్వహించిన పాదయాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో 200 యూనిట్లు ఫ్రీగా ఇస్తామని చెప్పి ప్రజలు వంచించారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేశామన్నారు. పారిశ్రామిక వేత్తలను బెదిరించడంతో ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారన్నారు. గంజాయి, నాటుసారాకు యువతను అలవాటు పడేలా చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సంజామల: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కలలకు రెక్కలు పథకం ద్వారా ఉన్నత చదువులు చదువుకునే అమ్మాయిల కలలు నెరవేరుతుందని తెలుగు మహిళ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సంజామల మండలం గిద్దలూరు గ్రామంలో ఆదివారం బీసీ ఇందిరమ్మ ఇంటింటి ప్రచారం చేసి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. బనగానపల్లెలో అరాచకపాలన, అవినీతి పాలన అంతం కావాలంటే నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీసీ జనార్దన్‌రెడ్డి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిం చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, అధిక సంఖ్యలో ఆమెకు టీడీపీ, జనసేన, బీజేపీ, కార్యకర్తలు, నాయకులు గజ మాలలతో ఘన స్వాగతం పలికారు.



బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన తుమ్మలపెంట ముస్లిం కుటుంబాలు



బనగానపల్లెలో కరపత్రాలు అందజేస్తున్న బీసీ

రుద్రవరంలో వర్షం



రుద్రవరంలో ధాన్యంపై కప్పి ఉంచిన పట్టలు

రుద్రవరం, ఏప్రిల్ 21: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శ్రీరంగాపురం, దక్షణ కొట్టాల, పెద్ద కంబళూరు, రుద్రవరం గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వరి ధాన్యం, మొక్క జొన్న కుప్పలపై పట్టలు కప్పి ఉంచారు. మరి కొన్ని చోట్ల మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. గాలికి వరి పంట నేలవాలింది. ప్రతి ఏడాది వేసవిలో గాలి వానకు పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

బేతంచెర్ల, ఏప్రిల్ 21: పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం కమిటీ ఆధ్వర్యం లో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొనా.. కర్నూలు జిల్లా డి.రుద్రవరం గ్రామానికి చెందిన రాముడు కుమారుడు ఎల్లగౌడు ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచి రూ.50వేల నగదును కైవసం చేసుకున్నాయి. అలాగే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ ఎద్దులు రెండో విజేతగా నిలిచి రూ.40వేలు, నంద్యాల మండలం ఏ-కోడూరు గ్రామానికి చెందిన సీఎస్ఆర్ బుల్స్ చాగంటి నాగ మల్లికార్జునరావు ఎద్దులు మూడో విజేతగా నిలిచి రూ.30వేలు గెలుచుకున్నాయి. అదేవిధంగా నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రామవరం గ్రామానికి చెందిన అక్షరరావు ఎద్దులు నిలిచి రూ.20వేలు, బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన బీరం రమాదేవి ఎద్దులు ఐదో విజేతగా నిలిచి రూ.10వేలు నగదును గెలుచుకున్నాయి. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు, దాతలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దేవసాథనం కమిటీ సభ్యులు మల్లు సుబ్బారెడ్డి, గౌరి ఉశేన్‌రెడ్డి, మల్లిపెద్ది రఘురాంరెడ్డి, అన్నారావు, యాంకర్ మహేష్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన



అహోబిలంలో గంగుల పేరున్న శిలాఫలకం

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 21: ఎన్నికల కమిషన్ కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదే శించింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడో ఒక చోట కోడ్ ఉల్లంఘన జరుగుతూనే ఉంది. అహోబిలంలోని నాయి బ్రాహ్మణ అన్నసత్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంలోని పాలిష్ బండకు ముసుగు వేశారే తప్ప దిమ్మెపైన ఉన్న గంగుల అక్షరాలకు ముసుగు వేయలేదు. గంగుల ఇంటిపేరున్న వ్యక్తి ఆళ్లగడ్డ అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

ప్రజాధనం వృథా

ప్రారంభానికి ముందే శిథిలమైన సంపు, వాటర్ పంపుహౌస్



రుద్రవరంలో శిథిలమైన సంప్, వాటర్ పంప్‌హౌస్

రుద్రవరం, ఏప్రిల్ 21: ప్రజాప్రతినిధులకు ఎన్నికలు వస్తేనే కానీ ప్రజా సమస్యలు గుర్తుకురావు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం హరినగరం మంచినీటి పథకానికి అనుసంధానం చేసి రుద్రవరంలో లక్షలాది రూపాయలు వెచ్చించి మినీ వాటర్ పంప్, పంప్ హౌస్ రూము నిర్మించారు. రుద్రవరం ప్రజలకు రక్షిత మంచినీరు అందడం ఏమో కానీ నిర్మించిన నిర్మాణాలు పగుళ్లు ఏర్పడి శిథిలమయ్యాయి. లక్షలాది రూపాయలు ప్రజాధనం వృథా అయిందే తప్ప రక్షిత మంచినీరు ప్రజలకు అందడంలేదు.

కుందరవాగు బ్రిడ్జికి మోక్షమెన్నడో?



భీమునిపాడు కంపమల్ల మెట్ట మధ్య కుందరవాగు బ్రిడ్జి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 21: ఏళ్లు గడుస్తున్నా కుందరవాగు బ్రిడ్జికి మోక్షం కలగడంలేదు. వైసీపీ హయాంలో ఈ బ్రిడ్జి కనీస మరమ్మతులకు నోచుకోలేదు. బ్రిడ్జి వెడల్పుకు కూడా నిధులు కేటాయించలేదు. కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. కాని భీమునిపాడు- కంపమల్ల మెట్ట మధ్యలో ఉన్న కుందరవాగు వద్ద సింగిల్ రోడ్డు బ్రిడ్జి ఉండడం, దీనికి తోడు బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ బ్రిడ్జి వద్ద ఎదురెదురు వాహనాలు ఎదురుపడినప్పుడు ఒక వాహనం నిలుపుకోవాల్సిందే. లేదంటే ప్రమాదాలు జరగాల్సిందే. గతంలో ఈ బ్రిడ్జి వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వంలో ఈ బ్రిడ్జికి డబుల్‌రోడ్డు నిర్మించి బ్రిడ్జి వెడల్పు చేస్తామని ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చి 5 ఏళ్లు పూర్తి కావస్తున్నా ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేయలేదు. దీంతో అనేక ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష సరళిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో, ప్రిన్సిపాల్

రుద్రవరం, ఏప్రిల్ 21: రుద్రవరం ఆదర్శ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు చెప్పారు. 152 మందికి గానూ 123 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ జాన కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'



డి.వనిపెంటలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఏప్రిల్ 21: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు గోపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని డి.వనిపెంట గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. టీడీపీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు బాబునాయుడు, నరసింహుడు, బాలయ్య, మహిళలు ఉన్నారు.

మద్యం స్వాధీనం

రుద్రవరం ఏప్రిల్ 21: మండలంలోని హరినగరం చెంచుగూడెంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి దాడి చేశారు. ఈ దాడిలో 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వెంకటమ్మ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

చాగలమర్రి, ఏప్రిల్ 21: గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద వివిధ వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో నగదు, అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. విలువైన వస్తువులు, నగదు సంబంధించి సరైన పత్రాలు ఉండాలని, లేకపోతే సీజ్ చేస్తామని తెలిపారు.

'పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం'

చాగలమర్రి, ఏప్రిల్ 21: రాష్ట్రంలో పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి చాగలమర్రి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 కరపత్రాలను అందజేశారు. టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలోని మక్కా మసీదు, రాయలకేఫ్, మల్లేవేముల బస్టాండు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, నాగరాజు, నరసింహులు, వేణుగోపాల్‌రెడ్డి, అక్బర్, ఉసేన్‌వలి, షరీఫ్, మౌలాలి, అనీఫ్, గఫార్ పాల్గొన్నారు.

చల్లా విజయభాస్కర్‌రెడ్డితో బీసీ రాజారెడ్డి భేటీ



టీడీపీ నాయకులతో బీసీ రాజారెడ్డి

అవుకు, ఏప్రిల్ 21: త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఆదివారం అవుకులోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి ఇంట్లో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆయనతో ఆదివారం భేటీ అయ్యారు. త్వరలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన విషయాలపై చర్చించారు. అవుకు మండలంలో టీడీపీ మెజార్టీపై తీసుకోవాల్సిన విషయాలపై చర్చించారు. అలాగే అవుకు మండల టీడీపీ నాయకులు మోట్ల రామిరెడ్డి, సంజామల మండలం టీడీపీ మండల నాయకుడు బెలుం సురేశ్‌రెడ్డిలతో బీసీ రాజారెడ్డి భేటీ అయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె నియోజవకవర్గంలో టీడీపీ బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. టీడీపీ నాయకులు బనగానపల్లె పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, ఇస్మాయిల్‌ఖాన్, రాయ లసీమ కలాం, పూలకలాం పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి



ముస్లింలతో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముస్లింలతో కోట్ల సుజాతమ్మ సమావేశమయ్యారు. టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయానికి కృషి చేస్తామని ముస్లింలు తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పీఆర్‌పల్లి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు నాగేశ్వర రావు, శ్రీనివాసులు, శంకర్, వెంకటేష్‌లతోపాటు 50 కుటుంబాలు సుజా తమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్, లక్ష్మీనారాయణ, రామసుబ్బయ్య, మోహన్, వెంకటరమణాచారి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 21: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రజా రవాణా సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏవైనా సమస్యలు ఉన్నా, ఫిర్యాదులను సెల్ 9959225798 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలపాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ ఎస్.హరితలక్ష్మి అన్నారు. ఆదివారం మండల క్రేంద మైన కొలిమిగుండ్లలోని జ్వాలా కాంప్లెక్స్‌లో డాక్టర్లు ఎస్.మల్లికార్జునరెడ్డి, ఎస్.హరితలక్ష్మిల ఆధ్వర్యంలో ఉచిత యోగా క్లాసులను ప్రారంభించారు. యోగా గురువు నాయుడు యోగా క్లాసులు కొనసాగిస్తారని అన్నారు.